రచన దీపావళి ప్రత్యేక సంచిక : 2001

# సౌందర్యరాగం

కళాజగత్తు ఓ స్వాప్నిక జగత్తు....

కఠోర వాస్తవ జీవితంతో, స్వప్నలోక సంకరం జరిగితే... కకావికలమే....

కలావాస్తవాల సమ్మేళనం బాహ్యలోక మేధకు అవగాహన కాదు....

అవగాహన కతీతమైన జ్ఞానం...జ్ఞానం కాదు యెవరికైనా...

మనిషి అంతర్లోకం లోంచీ ప్రవహించే కళ, కఠోర వాస్తవ ప్రపంచపు రంగులు పులుముకుని బాహ్యలోకాన్ని చూస్తుంది.

నిజమైన కళాకారులకు అంతర్లోక బహిర్లోకాల మధ్యవున్న భేదం అతి పల్చటి పొరగా వుంటుంది.... ఎటువేపునించీ ఉధృతి పెరిగినా ఆ అతి పల్చటి పొర చిరిగిపోయి వాళ్ల బాహ్యాంతర్లోకాలు ఒకదాంట్లో ఒకటి కలసి పోతాయి....

కకావికలుగా కలిసిపోయిన వాళ్ళ స్వాప్నిక అంతర్లోకాలూ, క్రమరాహిత్య బహిర్లోక చేష్టలూ... మామూలు మనుషుల జ్ఞానపరిధికి అతీతంగా వుంటూ, ఆ సదరు కళాకారులు పిచ్చివాళ్లుగా పిలవబడుతూంటారు.

* * *

లేత వెన్నెల ఆకాశం నేపథ్యంగా... కొండల నీడలు.. .చిన్న ముక్క చిరిగిపోయిన చంద్రుడు, వంకరగా...

అరా... ఒకటీ చుక్కలు ఎక్కడెక్కడో...

గుండెనూ...ఆలోచనల్నీ..... వెంట్రుకల్నీ చీలుస్తూ కొండగాలి...

"ఆహిర్ భైరవ్ పాడు" కొండగాలిని కాస్త ఆగమని చెప్పి ఆ శూన్యంలో కావేరి అడిగింది....

"చక్రవాకమనకూడదూ... భైరవ శబ్దం.. యీ సౌందర్యానికి నెగెటివ్‌గా లేదూ?" అన్నా...

అన్న తరువాత ఉలికిపడ్డా... అసంకల్పితంగా నెగటివ్ అన్న పదం వచ్చేసి నందుకు... అనుమానంగా, కాస్త భయంగా కావేరి వేపు చూసా.....

"ఇది సౌందర్యమా? యీ మెలంకలీని రొమాంటిసైజ్ చేసి పారేయడమే మీ కవులు చేసే దుర్మార్గం... మీ ఒక్కో వాక్యం వంద హత్యలకు సరి"

హమ్మయ్య కావేరి మామూలు పాత కావేరే....

"కవీ!?" చీకటో, వెలుగో, వెన్నెలో తెలీని అస్పష్టాస్పష్టపు స్త్రీమూర్తిని చూస్తూ అన్నా...

"నన్ననకు కవీ, అని కావేరీ అని పిలూ.... పిలూమన్నానా?"– పైటను నిండా కప్పు కుంటూ...సాయంత్రాన్ని చుట్టేసుకున్న తోట లా అంది కావేరి....

"నేన్నిజంగా నెగటివ్‌గా ఆలోచిస్తానా? చెప్పు" మళ్లీ అంది.

ఏది ప్రకృతీ ఏది వికృతీ... నాకు సౌందర్య అయినది తనకి సౌందర్యం అయ్యి తీరాలనే నా స్వార్థం యెంత వికృతమైనదీ...

నాకు తెలుసు కావేరిని వెంటాడ్తో వేటాడ్తోన్న పాప ముఖం....

అ వికృతత్వం... తన అందమైన కల విచ్ఛిన్న అందంలా చితికిన అసహ్యా దృశ్యం... మధ్య కావేరి లేతమనసు సున్నితమైన కళాహృదయం యెంత నలిగిందో, నలుగుతోందో...

ఎట్టి పరిస్థితుల్లోనూ నాకుగా ఆ విషయం కావేరి దగ్గర ప్రస్తావించకూడదన్న సైకియాట్రిస్ట్ మాట గుర్తొచ్చి... మౌనమై మిగిలిపోయా. అయినా నాకు తెల్సు కావేరిని వెంటాడ్తోన్న దేమిటో... కావేరి అందమైంది. పైగా చిత్రకారిణి....తన సృజన అంతా సౌందర్యమనే భ్రమను పాప ప్రియ భగ్నం చేసింది... బరు వుగా నిట్టూర్చి, "ఏమో తెలీదు" నాకే వినపడక అన్నా....

"నీకే కాదు నాక్కూడా తెలీదులే... నిజమే చక్రవాకమే బాంటుందేమో ఏమో ఏమై తేనేం...నాకెందుకూ...నాకు పాట కావాలి 'పూచోఁన కైసె' పాడవూ?"– మొత్తం తోటంతా కుదించుకుపోయి చిన్ని పువ్వైనట్టు అంది.

"ఓ నా చిన్ని పువ్వా పాడతా నీ కోసం... ఆరుద్ర 'కొండగాలి తిరిగింది' పాడనా చక్రవాక జన్యమే మలయమారుతం...వూఁ?"

"నన్నలా పిచ్చి పిచ్చిగా పిలవకూ అన్నానా?..... సరేలే పాడూ... మజ్జెలో నన్ను సుశీలన్చేయకేం" అంది... అని నవ్వింది.

తెరలు... తెరలుగా...

అలలు.... అలలుగా....

చెలరేగుతూ... పల్చటి ఆ బూడిదరంగు వెన్నెల వెలుగులో మంజిష్ఠమైన మొహంతో ... చుట్టూ వున్న ప్రకృతి కాసారానికి కేంద్రంలా ... తన చుట్టూ అలల్ని ప్రకృతి అంచులకు విసిరేస్తూ...

"పాడూ" అంది ఆయాసంగా...

మలయమారుతాన్ని గానం చేయమని తుఫాను అడిగినట్టుగా వుండింది...

మొగలిపూల వాసనతో జగతి మురిసి పోయిందీ...

ఉన్నట్టుండి...

"అపూ....! నాకు భయమేస్తోంది...నిజం చెప్పు.. నాకు పిచ్చా... ఇప్పుడు బాగై పోయిందా? నేను మునుపట్లాగానే వున్నానా... నువు పాడ్తోంటే నాకు భయమెందుకేస్తోందీ... ఈ క్షణం నిజం కాదేమోనన్న భ్రమనించా? ఆ అయ్యో పాపమనే మనుషుల్దగ్గరికి మళ్లీ తీసికెళ్ళవు కదూ?"

వెన్నెల ఆకాశం నిండా మబ్బుల విషాదమే...

ఆ చిరు వెన్నెల వెలుగుల్లో, ఆ పల్చటి ముఖంలో ఓ రెండు కళ్ళ ఆకాశం...

"కావేరీ! యీ లోకం పిచ్చిదంతే... నీ సున్నితమైన మనసు వాళ్ళ కర్థంకాదంతే"

"మరి నువ్వో...నువ్వేగా నన్నక్కడ చేర్పింది?" అక్కుజింగా అంది...

"నిజమే కావేరీ.... నీ స్వేచ్ఛ కోసం నీ చుట్టూ వున్న సానుభూతి అనే భయంకరమైన ఉచ్చు నించీ నిన్ను కాపాడ్డానికి నిన్ను ఇక్కడ చేర్చాల్సొచ్చింది... ఓ విధంగా నిర్బంధించాల్సొచ్చిందంటే నమ్ముతావా?"

"యూ ఆర్ నెగటివ్... అండ్ యూ స్పీక్ నాన్సెన్స్...అబ్సలూట్ నాన్సెన్స్" భుజమ్మీద గిచ్చుతూ అంది....

ఇద్దరం గట్టిగా నవ్వుకున్నాం...

లేచి నిలబడి రెండు చేతులూ బారజాచి గట్టిగా అరిచింది కావేరి

"దిసీజ మ్యాడ్ మ్యాడ్ మ్యాడ్ వాల్డ్" అని.

మా ముందు లోయను దాటి అటువేపు చీకటి కొండల గుండెల్ని తాకి వేయిగా విచ్చిపోయి ప్రతిధ్వనించింది కావేరి స్వరం.....

ఏది సంగీతం?! నిజం... నిజం... యిది ఆహిర్ భైరవే....

* * *

సరిగ్గా పన్నెండేళ్ళ క్రితం పని మీద ఢిల్లీ వెళ్లినపుడు ఓ ఆర్ట్ ఎక్సిబిషన్‌లో పార్టిసిపెంట్ అయిన కావేరిని పరిచయం చేసాడు ఢిల్లీ మిత్రుడు మాథుర్...

నేను 'హెలో' అనే లోపలే –

"మీరు నాకు తెలుసు" అని కమ్మనైన తెలుగులో అంది కావేరి.

'ఇదేమిటి! తెలుగుదేశానికి దూరంగా దేశ రాజధానిలో నేనెవరో తెలుసని ఓ లేత మామిడి చిగురు లాంటి స్త్రీ అందమైన తెలుగులో అనడమేమిటి!' అని ఆశ్చర్యపోయేంతలో...

"మీ 'అనాదీ – అనంతం' చదివాను. అయ్ వాజ్ ఇంప్రెస్డ్... బావుందని కాదూ.. అస్సలేమీ తెలీన్దానిగురించి అన్ని పేజీలు రాయడం చాలా కష్టం కదూ...అందుకన్నమాట"– అని విరిసిన గుమ్మడి పూవులా నవ్విన కావేరితో పరిచయం, మన రాష్ట్రానికొచ్చింతర్వాత స్నేహంగా పెరిగి...పెళ్లికి ప్రస్థానించి... ప్రియ పుట్టుక దగ్గర ఆగి... స్తంభించినట్టు... ఘనీభవించినట్టు..... సుఖమూ, దుఃఖమూ కాని నిరామయస్థితికి చేరుకుంది.

ప్రియ పుట్టినప్పుడు బాగానే ఉంది... తుఫాను ముందరి ప్రశాంతతలా...

మూడోనెల వచ్చేప్పటికి, ఓరోజు ఉదయాన్నే కావేరి....

"ఇటు చూడూ, పాప కళ్లల్లో ఏవో వైట్ ప్యాచెస్ వున్నట్టుగా లేవూ?" అంది.

చూసా నిజమే రెండు కళ్లల్లో తెల్లటి పూతలాగా...

"యీవినింగ్ డా॥ ఉమానాథ్ దగ్గరి కెళ్దాం" అని ఆ రోజు సాయంకాలమే పాపని తీసుకుని ఉమానాథ్ క్లినిక్కి వెళ్లాం....

"కుడ్‌బీ ఇన్ఫ్యాంటైల్ క్యాటరాక్ట్, చూద్దాం, డోంట్వరీ" అని సముదాయించి పంపాడు...

టెస్ట్‌లు జరుగుతున్నాయి.

ఆరోనెల వచ్చేప్పటికి, ఆ తెల్లటి పూవుల్లాంటి మరకలు పాప పాపల్ని కప్పేయసాగాయి....

కావేరి కలవరం చూడ్డానికి కష్టంగా వుంది.. నాకూ ఆందోళనకరంగానే వుంది... కావేరీ... పెయింటింగ్ తగ్గించేసింది.

పాపకు మరిన్ని టెస్ట్‌లు... ఇంకొన్ని... ఇంకా కొన్ని...

ఓ ఉదయాన డా॥ ఉమానాథే స్వయంగా ఇంటికొచ్చాడు...మొహం సీరియస్గా వుంది.. ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండా చెప్ప సాగాడు......

"అయ్‌నో హౌ హార్డిటీజ్... బట్ ఫ్యాక్ట్ యీజ్ ఫ్యాక్ట్ .... బ్రేసప్... పాపకున్నది రెటీనా బ్లాస్టోమా అనే డిసీజ్... మార్టాలిటీ 99%. మేం చేయగలిగింది ఒక్కటే, పాపని కాపాడాలంటే ఐబాల్స్ రెండూ తీసేయాలి... తీసేసినా కూడా మళ్లీ ఛాన్సే..... గ్యారంటీ లేదు... మీరిద్దరూ ఒప్పుకుంటే పాప కనుగుడ్లు తొలగించేస్తాం... మీరు భరించగలిగుండాలి... లేదూ ఇలాగే వుండనిమ్మంటే ఓ అయిదేళ్లు...అయాంసారీ.. కావేరీ! నాకు చిన్నప్పట్నించీ నువ్వు తెల్సు... నీ ధైర్యమూ, నీ మెంటాలిటీ బలమైనవి... ఇది నిజంగా మన చేతుల్లో లేదమ్మా... అయాం రియల్లీ సారీ.. బీ ప్రిపేర్డ్ ఫర్ద్ వర్స్ట్"

డా॥ ఉమానాథ్ చెప్పిన మాటలు విని కావేరి కాసేపు మౌనంగా వుంది... వున్నట్టుండి హోరున తుపానులాగా ఏడ్చేసింది... ఏడ్చీ ఏడ్చీ అలసిపోయింది. దీనంగా మారిపో

యింది........ ఘనీభవించిన విషాదమై పోయింది... నిస్సహాయంగా చూస్తూండి పోయింది.. గదిలోకెళ్లి పాప పక్కన శూన్యమై మిగిలిపోయింది.

తర్వాత ఓ రెండు నెల్లకి కావేరి మామూలై పోయింది.... యింతకుముందు కంటే గల గలా మాట్లాడ్తోంది.... మళ్లీ పెయింట్ చేస్తోంది.

అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నా.. నాకేదో అనుమానం..... కావేరి ఎక్కడో గాడి తప్పుతోందని.. డా॥ ఉమానాథ్‌ని అడిగా వెళ్ళి..

"నో నో.... షీ యిజ్ వెరీ ప్రాగ్మాటిక్, అండ్ వెరీ బ్రేవ్.. షీ యిజ్ టేకింగ్‌లైఫ్ యాజిట్ కేమ్ టు హర్... అంతే డోంట్వర్రీ" అని సర్దేసాడు....

అందరికీ తెలియని, మాకిద్దరికే తెలిసిన ప్రపంచంలో కావేరి రూపురేఖలు మారుతున్నాయి.... మీద చేయి వేస్తే, సున్నితంగా తీసేస్తుంది.. దగ్గరికి రావడం మానేసింది.... మనసు వికలమై వున్న తన శరీరం కూడా వికలమయ్యే వుంటుంది... మనసులేని శరీరాన్ని కోరే సంస్కారం నాలో లేదు... కానీ కావేరిలో మార్పులు నాకు భయాన్ని కలిగించసాగాయి... ఉన్నట్టుండి మధ్యరాత్రి లేచి, తన పెయింటింగ్ గదిలోకెళ్తుంది... తలుపులు మూసేసుకుంటుంది. ఎప్పుడో తెల్లారుజామున మందార నేత్రాల్తో మౌనంగా బైటికొస్తుంది..... ముఖ్యంగా ఆ మసక వెల్తుర్లో పాప పక్కన నిలబడి పాపను నిశ్చలంగా అలా అలా చూస్తూండిపోతుంది.

కావేరి ఫైన్ ఆర్ట్సులో డిగ్రీ తర్వాత ఓరియంటల్ ఆర్ట్‌లో తర్ఫీదు పొందింది. ఓ సంవత్సరం పాటు చైనాలో ఉండొచ్చింది...తన ప్రపంచమంతా క్యాన్వాస్‌లూ, హ్యాండ్మేడ్ పేపరూ, పెయింట్సూ.... బ్రష్‌లూ....... పేస్టల్సూ.. పెన్సిల్సూ.... తను పెయింట్ చేసేప్పుడు ఎవ్వర్నీ రానివ్వదు. వేసింతర్వాతో.. మధ్యలోనో చూపుతుంది.. అయితే ఆ గదిలోకి అందరూ వెళ్లవచ్చు.. కానీ –

ఈ మధ్య ఆ గదికి తాళం వేస్తోంది కొత్తగా ....నాకు భయంగా....

* * *

పాపకు కనుగుడ్లు లావవుతున్నాయి. ఆ చిన్ని బుల్లి ముఖం వికృతంగా మారుతోంది.. సంకల్పపూర్వకంగా కూడా పాప ముఖం చూళ్లేకపోతున్నాను నేను... నన్ను నేను యెంత ప్రశ్నించుకున్నా, ఎంత విశ్లేషించుకున్నా.... అసలు అటువేపు వెళ్ళలేకపోతున్నా....

కావేరి మాత్రం తదేకంగా గంటల తరబడి పాపను చూస్తూ కూచుండిపోతోంది....

రోజులు గడిచేకొద్దీ.... వికృతత్వపు తీవ్రత పెరగసాగింది....

కళ్ల స్థానంలో లావాటి గడ్డలు పెరగసాగాయి.... కనురెప్పలు రెండూ రెండు చిన్న పెన్సిలు గీతల్లాగయ్యాయి.....

నాలో పాప చనిపోతే బావుణ్ణు అని అనుకునే అమానవీయ స్థితి బలపడ సాగింది... నాలో దిగులూ, నిరాశా ఆవరించేసాయి... దీనికి విరుద్ధంగా -

కావేరి అసహజంగా చలాకీగా తయారైంది...

అయిన దానికీ కానిదానికీ పగలబడి నవ్వుతోంది.....

ముఖ్యంగా తిండి విషయంలో యెంతో నాజూకుగా వుండే కావేరి విపరీతంగా తినడం మొదలుపెట్టింది...

అసలు పౌడరూ, కాటుక తప్ప మరేమీ వాడని కావేరి... కాంప్యాక్ట్‌లూ... మస్కరాలూ, ఐ లైనర్లూ... లిప్‌స్టిక్కూలూ... నెయిల్ పెయింట్‌లూ వాడ్డం చూడ్డం నా వల్ల కాలేదు.

ఈ కకావికల మధ్యన... ఈ మానసిక దారిద్ర్యం మధ్యన కాలం కాస్త ముందుకు కదలింది...

నాకు మనశ్శాంతినిస్తూ మూడో ఏట పాప మరణించింది.

కావేరి కంట నీరు పెట్టలేదు.

కానీ-

తన పెయింటింగ్ గదికి వున్న తాళం మీద యింకో తాళం వేసింది.

* * *

కావేరి తండ్రిగారు సెంట్రల్ గవర్నమెంట్‌లో సెక్రటరీ హోదాలో రిటైరయ్యారు... శ్రోత్రియ బ్రాహ్మలు... కావేరి తాతగారు మరీనూ-పూజలూ పునస్కారాలూ, హోమాలూ నానా హంగామాలూ....... నాకవేవీ గిట్టవు...... కావేరి తండ్రికి ఆయన తండ్రిగారి మీద అపారమైన గౌరవం, భక్తీ... ఆయన మాట జవదాటడీయన... ఒక్క కావేరి చైనా పర్యటన విషయంలో మాత్రం ఆయన తన తండ్రి మాటను తోసిరాజని కావేరిని చైనా పంపారు... కావేరి ఒక్కగానొక్క కూతురు.

పాప మరణం కారణాన కావేరి అమ్మా నాన్న, వాళ్ల తాతగారు వచ్చారు... కావేరి పరిస్థితి చూచాయగా కావేరి నాన్నగారికి చెప్పాను...

"మీరేమీ అనుకోపోతే మీకిబ్బంది లేదూ అనుకుంటే ఓ రెండు మూడు నెలలు ఇక్కడే వుంటామండీ..... అమ్మలు కొద్దిగా కోలుకునే వరకూ" అని అడిగారు కావేరి నాన్నగారు...

సరేనన్నాను... కావేరి తాతగారి పూజలూ పునస్కారాలతో నా ఇల్లు నాకే కొత్త అనిపిస్తున్నా... కావేరి కోసం పట్టించుకోలేదు...

ఓ నెలన్నర గడిచింది...

ఓ రోజు మధ్యాహ్నం ఆఫీసుకు కావేరి నాన్నగారి ఫోన్... చాలా గాబరాగా మాట్లాడు తున్నాడాయన.

"మీరు త్వరగా రండింటికి..... అమ్మలు ఆ బొమ్మల గదిలో కెళ్ళి తాళమేసుకుంది మీరటు వెళ్ళగానే... ఇప్పటి దాకా బైటికి రాలేదు.. పిలిస్తే పలకట్లేదు... ఇప్పుడు గదిలోపల్నించీ యేదో కాల్తోన్న వాసనొస్తోంది త్వరగా రండి"

ఒక్కసారి గుండె లయ తప్పి మళ్లీ కొట్టుకోసాగింది.... కావేరి... ఆత్మహత్య నో... లేదు..... కాదు.. కావేరి నన్నొదిలి... ఛీ... అయ్యుండదు.....

ఆఘమేఘాల మీద పది నిముషాల్లో యింట్లో వున్నా....

అప్పటికే గది తలుపులు బద్దలు కొట్టించారు చుట్టుపక్కలవాళ్ళతో... గదినిండా చీలికలు పీలికలైన క్యాన్వాస్.... విరిగిపోయిన ఫ్రేములూ... చల్లేసిన రంగులూ.. చాలా క్యాన్వాస్ చించేసి గది మధ్య గుట్టగా చేసి నిప్పు పెట్టేసుంది... గదంతా కాలిన కమురు వాసన.... అటు వేపు కిటికీ దగ్గర గోడకానుకుని మోకాళ్ల మధ్య తలపెట్టుకుని..

నా కావేరి... నా ప్రియురాలు.. నా స్నేహం.. నా మమత... అందర్నీ బైటకెళ్లమని సైగ చేసాను....

అందరూ మౌనంగా వెళ్ళిపోయారు....

గదంతా చూసాను...

ఇంకా మిగులున్న క్యాన్వాస్‌ల మీద గజిబిజిగా... బీభత్సంగా వున్న సైకడెలిక్ ఇమేజ్‌లు...పాప వికృత ముఖం... రకరకాలుగా..... ఒకే క్యాన్వాస్ మీద ఎన్నో ముఖాలుగా.....

ఉబ్బిన కళ్లు... కళ్ల మీద ముద్దలు ముద్దలుగా.... భయానకంగా.... హృదయ విదారకంగా....

ఓరియంటల్ ఆర్ట్‌లో చెయ్యి తిరిగిన కావేరి చిత్రించినవే...

ఉధృతంగా ప్రవహిస్తున్న ఈ కావేరిని... ఓ మహా గవ్వారం తనలోకి పీల్చేసుకున్నట్టు.. పాప వికృతత్వం..

నెమ్మదిగా దగ్గరికెళ్లి, పక్కన కూచుని భుజమ్మీద చెయ్యేసి పిలిచా...

"కావేరీ!"

కరవీర పుష్పాల్లాంటి కళ్లెత్తి చూసింది... ఆ కళ్లల్లో దైన్యం ఆకాశమంత బరువుగా ఉంది.

"పద బైటికి రా" భుజం చుట్టూ చెయ్యేసి అన్నా....

తల అడ్డంగా ఊపింది....

"వద్దు.... వద్దు నేనేమీ చేతకాని దాన్ని... నేను అందమైన వేవీ క్రియేట్ చేయలేను... అయాం యినేప్కబుల్ ఆఫ్ క్రియేటింగ్ బ్యూటీ..... అయాం యూజ్‌లెస్" అని హోరున ఏడవడం మొదలుపెట్టింది...

ఏమని ఓదార్చను.. నా అసహాయత కూడా ఏడుపుగానే పరిణమించింది... కావేరిని నిండా కౌగిలించుకుని హోరున నేనూ ఏడ్చేసాను.

ఆ చిరిగిపోయిన క్యాన్వాస్‌ల మధ్యన... వికృతమైన పాప ముఖచిత్రాల మధ్య.... ఆ సైకడెలిక్ ఇమేజ్‌ల మధ్య..... రెండు శిథిల మానసాలమై నేనూ....కావేరీ.....

* * *

కావేరికి పిచ్చన్నారు........పాపను దయ్యప్పిల్లన్నారు... కావేరి తాతగారు హోమాలు చేయించడం మొదలుపెట్టాడు... భూత వైద్యం చేయించాలన్నాడు....

చుట్టూ వున్న ప్రజలు సానుభూతి చూపులు చురకత్తుల్లె కావేరిని చీల్చసాగాయి...

అందరి సానుభూతులూ, ఆత్మీయతలూ, అభిమానాలూ, మౌఢ్యమూ సాలెగూళ్లలా కావేరిని అల్లేయసాగాయి..

వీళ్లందరూ కలసి వీళ్ల సానుభూతి మౌఢ్యంతో కావేరిని చంపేస్తారు.... నాకు తెలుసు.... నా కావేరిని నా నించీ దూరంగా లాక్కెళ్తారు.. కావేరిని, కళాకారిణి కావేరిని.. వెన్నెలల కావేరిని... గలగలల కావేరిని. నా కావేరిని కాపాడుకోవాలి... నిర్ణయించేసుకున్నా....

డా॥ ఉమానాథ్ సాయంతో అందరికీ దూరంగా చాలా దూరంగా తీసుకొచ్చి దేశంలోనే బెస్ట్ కౌన్సిలింగ్ ఇప్పించా.. చిన్నగా చిన చిన్నగా కోలుకుని ఇదుగో ఈ రోజున ఇలా....

* * *

నాగమల్లి పూలతో నల్లని జడ నవ్వింది. మలయ మారుతం...

నా దగ్గరగా జరిగి కూచుంది కావేరి.. నా భుజమ్మీద తల ఆనించి, "లేదులే నాకు భయం లేదు పాడూ..." అంది.

చలిగాలి ఎక్కువైంది... కావేరి చుట్టూ చెయ్యి బిగించి, "కాటేజ్ కెళ్దామా?" అనడిగా...

"ఊహూఁ... యింకాస్సేపిలాగే యిక్కడే బావుందీ" అంది కావేరి....

"ఆరోగ్యం పాడౌతుంది"

"పాడు కాని ఆరోగ్యం వుందా?"

"ఉంటుందేమో?"

"ఉండదు కూడా నేమో కదూ?"

"అవునేమో?"

"కాదు కూడా నేమో... యేమో?"

నాకు మరింత దగ్గరగా జరిగి కూచుంది కావేరి.

"మనం వద్దూ అనుకున్నవన్నిటినీ మనం మర్చిపోగలిగితే యెంత బాగో కదూ?" అంది.

తనూ, నేనూ మరచిపోవాలనుకుంటున్న దేమో తెలుసు... నెమ్మదిగా చేత్తో తట్టి ఆ స్పర్శతోటే సమాధానం చెప్పా.....

"పాటకూ, పెయింటింగ్‌కూ మధ్య వున్న సంబంధం గొప్పది"

"యెలా కావేరీ?"

"నువ్వు పాడుతున్న పాట నాకు భయం కలిగిస్తుంది.. నేను వేసిన పెయింటింగ్స్ నీకూ అలాగే"

"అంటే యెలా కావేరీ?"

"మలయమారుత రాగంలో నువ్వు పాడుతున్న కమ్మటి పాట వెనక నాకు మెలంకలీ వినిపిస్తుంది... నిజానికి పాప పెయింటింగ్స్ అన్నీ అద్భుతమైనవే టెక్నికల్గా.... కానీ అవి నీకు భయాన్ని కలిగిస్తాయి - నిజం చెప్పూ" అంది.

కావేరి విశ్లేషణ చాలా గొప్పగా ఉంది... అయినా భయాన్ని కలిగిస్తోంది.

మాట మార్చడానికి....

"అందం గురించయితే మంచులో తడిసిన వెన్నెలనేల గడ్డకట్టిన అందంలా వుంది కదూ కవీ! అచ్చు నీలాగే" నిష్కల్మషంగా అన్నా.

తలెత్తి మసకవెల్తుర్లో నా కళ్లలోకి చూసి... మెల్లిగా ఒక్కో పదాన్నీ ఉచ్చరిస్తూ అడిగింది కావేరి.... వెన్నెలంత మెత్తగా..... వెన్నెలంత మసకగానూ...

"నిజం చెప్పు - నువ్వన్నది యెంత నిజం? ఈ ప్రపంచంలో పరిపూర్ణమైన సౌందర్యం అంటూ వుందా?"

ఆ మహోత్కృష్ట శాశ్వత సత్యాన్ని కాదనగలిగిన ధైర్యం ఎవరికుంటుంది?